రైతుకు విశిష్ట ప్రయోజనాలు



నల్లచెరువు మండలం యర్రగుంటపల్లిలో ఫార్మర్ ఐడీ కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

- సొంత భూమి ఉన్నవారే అర్హులు
- సంక్షేమ పథకా అమలుకు గుర్తింపు కార్డే ప్రామాణికం
- ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న 1200 మంది రైతులు

నల్లచెరువు/ ఎన్‌పీకుంట : ప్రతి పౌరుడికి ఆధార్ కార్డుతో గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకూ 11 అంకెలు కలిగిన యూనిక్ ఐడీ నంబర్‌తో రైతుకు ప్రత్యేక గుర్తింపు ఐడీ కార్డులను అందించేందుకు ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. కార్డు పొందేందుకు మొదటగా పీఎం కిసాన్ పథకం పొందుతున్న లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. త్వరలోనే సొంత భూమి ఉన్న ప్రతి రైతుకూ ఈ కార్డును మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. భవిష్యత్‌లో పలు సంక్షేమ పథకాల అమలుకు ఈ యూనిక్ ఐడీనే రైతులకు ప్రామాణికం కానుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో మొత్తం 6 వేల మందికి పైగా రైతులు ఉన్నారు. వీరంతా రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ కోసం నమోదు చేసుకోవాల్సి ఉంది. సొంత పొలం ఉన్న రైతులందరూ వ్యవసాయ అధికారులు సూచించిన ధ్రువ పత్రాలను తీసుకొని స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే అధికారులు రైతుల వివరాలు నమోదు చేసుకుంటారు.

నమోదుకు అవసరమైన ధ్రువ పత్రాలు

రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్.(పాసు పుస్తకం లేనిచో) వన్‌బీ, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్ రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్తే రైతు మొబైల్ ఫోన్‌కు మూడు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి రైతు యూనిక్ ఐడీ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.

కార్డు ప్రయోజనాలు

ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందేందుకు ఈ కార్డు ఐడీ నంబర్ గుర్తింగా పని చేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్, ఇరిగేషన్‌పై రాయితీ, పెట్టుబడి సాయం ఇతర పథకాలను నేరుగా పొందే వీలు కలుగుతుంది.

ప్రతి రైతూ నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు యూనిక్ ఐడీ పొందాలి, ప్రభుత్వం అదించే పథకాలను ఈ ఐడీ కార్డు ద్వారానే పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకూ సుమారు 1200 మంది రైతులు ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

–భారతి, ఏఓ నల్లచెరువు

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కత్తి లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కత్తి మల్లికార్జునరెడ్డి మాతృమూర్తి కత్తి లక్ష్మమ్మ(90) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మల్లికార్జునరెడ్డి ఇంటికి చేరుకుని లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరం వైఎస్సార్‌సీపీ నేత తలారి మధు తండ్రి తలారి నారప్ప అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ తిప్పన్న, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, లాయర్ కత్తి గంగిరెడ్డి, విశ్రాంత ఎంఈఓ నాగిరెడ్డి, నాయకులు బుక్కపట్నం కేశప్ప, నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయులు, రఘునాథరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం వెంగళమ్మచెరువులో వైఎస్సార్‌సీపీ నేత బుద్దన్నగారి ఆంజనేయులు నూతన గృహ ప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు.

శుభకార్యం

అమడగూరు: కస్సముద్రం సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి కుమారుడు సుజయ్‌రెడ్డి వివాహం శుక్రవారం బాగేపల్లిలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ విభాగం ఇన్‌చార్జ్ కొత్తకోట చక్రధరరెడ్డి, సీఈసీ సభ్యుడు డాక్టర్ నాగేంద్రకుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రమేష్‌నాయుడుపై కేసు నమోదు చేయాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: తాడిపత్రికి చెందిన రమేష్‌నాయుడుపై కేసు నమోదు చేయాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు డీఎస్పీ, సీఐ నారాయణరెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా సమితి పార్టీ ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో వాల్మీకులను కించపరిచేలా మాట్లాడారన్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన సీఐ నారాయణరెడ్డి రమేష్‌నాయుడిని విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాల్మీకి సంఘం నాయకులు గంగరాజా, శంకర, ఆనంద్, చలపతి, లాయర్ హరి, నరసింహులు, సుధాకర్, రామాంజి, నాగరాజు, రవి, వెంకటేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ భూమిక కుటుంబానికి పరామర్శ



డాక్టర్ భూమిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

తలుపుల: ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మేనకోడలు, నంగివాండ్లపల్లికి చెందిన డాక్టర్ భూమిక హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆమె అవయవాలను దానం చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని డాక్టర్ భూమిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన అవయవాలను ఇవ్వడం ద్వారా ఆరుగురికి ప్రాణదానం చేసిన డాక్టర్ భూమిక ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ మీసుగ నాగరాజు

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీసుగ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రామగిరి గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజా సమస్యలపై అందరూ పోరాడదామన్నారు. కార్యక్రమంలో గంగన్న, శంకరయ్య, దాసరి రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆర్డీఓ మహేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, కంటి వైద్యులు ఉరుకుందప్ప, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంటిచూపు తగ్గిన 156 మంది విద్యార్థులకు ఉచితంగా అద్దాలను అందించారు. పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 53 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు అప్తాప్, కంటి వైద్యులు జయరాములు, పాఠశాల హెచ్ఎం శంకరన్న, కేజీబీవీ ఎస్ మోహనమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. ఖాళీగా ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలైనా ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై ఈనెల 17న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి నాగమణి, సీఐటీయూ మండల కార్యదర్శులు బ్యాళ్ల అంజి, ముత్యాలు పాల్గొన్నారు.

విలువలకు మారుపేరు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఏపీ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చేసిన సేవలను మనమందరం స్మరించుకోవాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలో సంజీవయ్య జయంతి వేడులకు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలను ఎస్పీ కొనియాడారు. ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, మహేష్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఉన్నత విలువలకు మారుపేరుగా నిలిచారని ఎంపీడీఓ నరసింహనాయుడు కొనియాడారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన సంజీవయ్య తన అసమాన ప్రతిభతో ఉన్నత పదవులను అలంకరించారన్నారు. నీతి, నిజాయితీకి, నిరాడంబర జీవితానికి మారుపేరుగా మారి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. డిస్ట్రిక్ట్ అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఈసీ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ గుప్త సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దళిత కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన పదవులను అధిరోహించారన్నారు. ఈఓఆర్డీ శకుంతల, ఏఓ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు.. శుక్రవారం హనుమాన్ కూడలి వద్ద సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్య ఏపీ తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు ఫొటోసాయి, ఎస్టీడీ నరసింహులు, సిద్దరాపురం కేశప్ప, అంజినప్ప, నరశింహులు, బండ్లపల్లి అంజినప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడిఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ తుమ్మల పర్వీన్ భాను, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభరెడ్డి, వెంకటరమణ నాయక్, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి టౌన్: కదిరి డివిజన్‌లోని వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ కార్యాలయంలో నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు సోమశేఖర్, రామాంజి, చింతమాని నరసింహులు, శ్రీనివాసులు, రామాంజనేయులు, అది బయన్న, నాగరాజు, రాయుడు, వెంకటేశ్వర్లు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

ధర్మవరం అర్బన్: దుర్గానగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రియ, సేవా సంస్థ వైస్ ప్రెసిడెంట్ జగ్గా వేణుగోపాల్ వాటిని గర్భిణులకు అందించారు. దాత లయోలా పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చిన్నప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, చంద్రశేఖర్, సాయి ప్రసాద్, జగ్గా నాగరాజు, రమేష్, రాజ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఇళ్లలో చోరీ

బత్తలపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం అన్నదమ్ముళ్ల ఇళ్లలో చోరీ జరిగింది. బత్తలపల్లికి చెందిన కోటి చంద్రమోహన్, కోటి నాగరాజు శుక్రవారం ఇళ్లకు తాళం వేసి తమ సమీప బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు బాత్‌రూం, పాలక్యాన్ ఉన్న తాళం చెవులు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. చంద్రమోహన్ ఇంట్లో జత కమ్మలు, నాగరాజు ఇంట్లో చిన్న ఉంగరం ఒకటి, మహిళ ఉంగరం ఒకటి, రూ.2వేలు నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ సోమశేఖర్ ఘటనస్థలాన్ని పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఓడీచెరువు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం వివారాలను ఆరా తీశారు. పిల్లల హాజరు రికార్డులు పరిశీలించారు. పిల్లలదంరికీ ఆధార్ నమోదు చేయించాలని కార్యకర్తలు కళావతి, అఖీల, జయమ్మ, ఆశీర్వాదమ్మకు సూచించారు.

ఎల్లమ్మ దేవతకు పూజలు



పోలేపల్లిలో ఎల్లమ్మ దేవతను ఊరేగిస్తున్న గ్రామస్తులు

రామగిరి: మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు బోనాలతో ఊరేగింపు చేపట్టి, అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు అమ్మ వారిని పూలతో అలంకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

పోలీసుల పల్లెనిద్ర

కదిరి అర్బన్: చలమకుంట్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

దిగుబడి అంచనా కోసమే పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్లో వర్షాధారంగా సాగు చేసిన కంది పంటలో దిగుబడి అంచనా కోసమే పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఈదుల ముష్టూరులోలోని 100–2ఎ సర్వే నెంబర్లలో రైతు లక్ష్మీనారాయణ చౌదరి పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించగా 760 గ్రాముల దిగుబడి వచ్చింది. ఏఈఓ ఉపేంద్రరెడ్డి, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ మండల కో–ఆర్డినేటర్ మంజునాథ్, వీఏఏ నిఖితకుమారి ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ముదిగుబ్బ: మద్దన్నగారిపల్లికి చెందిన బీజేపీ నేత గడ్డం రాజగోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం మంత్రి సత్యకుమార్ గ్రామానికి చేరుకుని రాజగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ ఆదినారాయణ ఉన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

ధర్మవరం రూరల్: మండలవ్యాప్తంగా 2023–24లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై శనివారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. తనిఖీ సిబ్బంది గ్రామాల వారీగా పనులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం: పట్టణంలోని జీవానంద పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థికి గాయాలయ్యాయని, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, ఏఐఎస్ఓ విద్యార్థి సంఘాల నేతలు ఆర్డీఓను కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య, ఏఐఎస్ఓ జిల్లా కార్యదర్శి నిరంజన్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌లు మాట్లాడుతూ జీవానంద పాఠశాలలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఎల్‌కేజీ విద్యార్థి ప్రజ్వలానందకు కాలిన గాయాలయ్యాయని తెలిపారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి రూ.5 లక్షల జరిమానా విధించాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నల్లచెరువు: విద్యార్థులు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీహెచ్ఓ రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆయన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఎస్ఓ శిరీష, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఏఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జట్కా పద్ధతిలో నిర్వహించాలి



ఆలయ ఈఓ రవీంద్రరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారి మొక్కుల్లో భాగంగా జంతుబలిని హిందూ సంప్రదాయమైన జట్కా పద్ధతిలో నిర్వహించాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆలయ ఈఓ రవీంద్ర రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జంతుబలిలో హలాల్ పద్ధతిలో కాకుండా జట్కా పద్ధతిని అనుసరించాలన్నారు. ఆలయ పరిధిలోని దుకాణాల నిర్వహణకు కేవలం హిందువులకే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆలయ అభివృద్ధికి చర్యలు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఫిజియోథెరపీ శిబిరం



ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు శుక్రవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్ట్ రూపేష్‌నాయక్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సౌజన్య, ఆన్వేష్ పాల్గొన్నారు.

సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు



వేరుశనగ సాగులో మెలకువలు తెలియజేస్తున్న ఏఓ వెంకటరమణాచారి

అమడగూరు: పంటల సాగులో వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలను పాటించడం ద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటరమణాచారి పేర్కొన్నారు. శుక్రవారం అమడగూరు, పూలకుంటపల్లిలో వేరుశనగ, కంది పంటల సాగుపై డెమో నిర్వహించారు. ఏఓ వేరుశనగలో పూతదశ, ఊడగలు దిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రసం పీల్చే పురుగులు, లద్దె పురుగుల నివారణ చర్యలు వివరించారు. కంది పంటలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎండుతెగులు, మారుకా మచ్చలపరుగు, తెగుళ్లను నియంత్రించవచ్చని సూచించారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకున్న దుర్గమ్మ అమ్మవారు

తాడిమర్రి: దాడితోట గ్రామంలోని దుర్గమ్మ అమ్మవారు ఆలయంలో శుక్రవారం నాల్గవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి బోనాలు, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మురారి కృష్ణమూర్తి, మురారి లక్ష్మీదేవి జ్ఞాపకార్థం వారి వారసులు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆరోగ్య ఉప కేంద్రం ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్

తనకల్లు: బాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలను చైతన్యపర్చాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుల కొరత ఉంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. కొక్కంటి పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మరాజు ఉన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్డి జేఏసీ నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

ధర్మవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన నివాసంలో శుక్రవారం ఓసీ జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి, నేతలు కలిశారు. రాష్ట్రంలో రెడ్లు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దార రామకృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, విజయవాడ అధ్యక్షురాలు భవానిరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాకినాడ నాగేంద్రరెడ్డి, కడప చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లి గ్రామానికి చెందని ఓ వివాహిత అదృశ్యమైంది. ఈనెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించారు. అయినా ప్రయోజనం కనిపించకపోవడంతో బాధితురాలి భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టాలని, మహిళ ఆచూకీ తెలిసిన వారు 9440796839 నంబర్‌కు సమాచారం అందించాలని పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న పేర్కొన్నారు.

చెరువుల్లోకి చేపపిల్లల విడుదల

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం, మేడాపురం గ్రామాల్లోని చెరువుల్లోకి మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపపిల్లలను విడుదల చేశారు. నాగసముద్రం చెరువులోకి 30 వేలు, మేడాపురం చెరువులోకి 20 వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం మత్స్యశాఖ సహాయ సంచాలకులు శంకరయ్య, వీఎఫ్ఏ భార్గవి, పంచాయతీ కార్యదర్శి చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సూర్య హైస్కూల్‌లో శుక్రవారం బ్లాక్‌డే సందర్భంగా మాజీ ఆర్మీ ఉద్యోగులకు ఘన సన్మానం చేశారు. పుల్వామా ఘటనలో మరణించిన 40 మంది వీర సైనికులను స్మరిస్తూ బ్లాక్ డేను పురస్కరించుకుని మాజీ సైనికులు నాగమల్లేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామాంజనేయులను సూర్య పాఠశాల కరస్పాండెంట్ నరేంద్ర శాలువాలతో సన్మానించారు.